క్లుప్తంగా

తాగునీటి రిజర్వాయర్ ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ సర్కిల్–1 పరిధిలోని 46వ డివిజన్ భీమునివారి పేట కొండ ప్రాంతం యానాదుల బజార్‌లో 455 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి రిజర్వాయర్‌ను మేయర్ రాయన భాగ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సర్కిల్ వన్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి సౌకర్యం మరింత మెరుగుపరిచేందుకు నూతనంగా ఈ రిజర్వాయర్‌ను మున్సిపల్ సాధారణ నిధులు రూ. 1.7 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. నగరంలో నిరంతరం తాగునీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం భక్తులకు అన్నప్రసాదం అందించారు. దాతలు చిన్ని సుబ్బారావు, వేంకటలక్ష్మి, కొత్తమాసు హరిగోపాల్, భారతి సహకారంతో అన్నప్రసాదం అందించినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి తెలిపారు. దేవాలయంలో స్వామి అమ్మవార్లకు అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలలో శ్రీవారి సేవకు ఉపయోగించిన పుష్పాలతో తయారైన అగరబత్తి, వీభూధి, సబ్బులను దేవాలయం స్టాల్‌లో విక్రయించారు.

పూర్తి స్థాయిలో డీసిల్టింగ్ పనులు పూర్తిచేయాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డీసిల్టింగ్ పనులను పూర్తిస్థాయిలో చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శనివారం ఆయన క్యాంప్ కార్యాలయం నుంచి వీఎంసీ వివిధ శాఖాధిపతులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, ఫైవ్ రూట్, బెంజ్ సర్కిల్ నుంచి రామవరప్పాడు వెళ్లే సర్వీసు రోడ్డు ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో డీసిల్టింగ్ పనులను చేపట్టాలన్నారు. రోడ్డు మీద వర్షపు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వర్షం పడిన వెంటనే మాన్సూన్ రెస్పాన్స్ టీమ్ వారు తీసుకోవాల్సిన చర్యలు, తొలగించాల్సిన వర్షపు నీటి నిల్వలను పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటి నిల్వలను తీసే గల్పర్లు, సక్కర్ మెషిన్లు, వాహనాలు, సిద్ధంగా ఉంచుకోవాలని వెహికల్ డిపో ఇంజినీరింగ్ సిబ్బంది, పారిశుద్ధ సిబ్బందితో సమన్వయంతో ఎటువంటి అవసరాలున్న వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడితేనే కాకుండా నగరంలో నిరంతరాయంగా డీసిల్టింగ్ పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని, ముఖ్యమైన ప్రదేశాల్లో అవసరమైన వాహనాలన్నింటిని ఉపయోగించి డీసిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

దత్తాత్రేయునికి లక్ష తులసి పూజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శనివారం దత్తాత్రేయస్వామివారికి శనివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీదత్తాత్రేయ స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి, మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.



అసాంఘిక శక్తులకు ఆవాసం

- సత్యనారాయణపురం రైల్వే పార్కు దుస్థితి
- నిర్వహణను పట్టించుకోని రైల్వే అధికారులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్‌లో అతి పెద్దదైన సత్యనారాయణపురంలోని రైల్వేపార్కు నిర్వహణ లోపంతో సందర్శకుల సంఖ్య పూర్తిగా తగ్గి అసాంఘిక శక్తులకు ఆవాసంగా మారింది. సత్యనారాయణపురంలోని రైల్వే కాలనీ వాసుల కోసం రైల్వేశాఖ బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలోని ఈటీటీసీ పక్కన 2015 జూన్ 20న అప్పటి దక్షిణ మధ్య రైల్వే జీఎం పీకే శ్రీవాస్తవ చేతుల మీదుగా 'రైల్ పార్కు' ఏర్పాటు చేశారు. సకల సదుపాయాలతో, పచ్చని చెట్లు, సందర్శకులు సేద తీరేందుకు సిమెంట్ బల్లలు, పిల్లలు ఆడుకునేందుకు ఆటపరికరాలు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధుల కోసం వాకింగ్ ట్రాక్, విద్యుత్ లైట్ల వెలుగులో రైల్వే పార్కు చక్కటి ఆహ్లాదాన్ని కాలనీ వాసులకు అందించేది. అనంతరం అధికారులు పార్కు నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో ఈ పార్కు అసాంఘిక శక్తుల అడ్డాగా మారింది.



సత్యనారాయణపురంలోని రైల్ పార్కు



పచ్చదనం లేక మైదానాన్ని తలపిస్తున్న పార్కు

మైదానాన్ని తలపిస్తున్న పార్కు...

గతంలో పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉదయం పార్కుకు చేరుకుని వాకింగ్ చేసేవారు. సాయంత్రం మహిళలు, వృద్ధులు పిల్లలతో వచ్చి పార్కులోని ఆట పరికరాలతో పిల్లలను ఆడిస్తూ ఆహ్లాదభరితంగా గడిపేవారు. ప్రస్తుతం పార్కులో ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్, ఎటు చూసినా ఎండిపోయి నేలకొరిగిన వృక్షాలు, మొక్కలతో మైదానాన్ని తలపించేలా ఉంది. కనీసం కూర్చునేందుకు సదుపాయాలు కూడా లేవు. పిల్లల ఆట పరికరాలైతే మచ్చుకైనా కనిపించవు. ఇదీ ప్రస్తుతం రైల్వే పార్కులో ఉన్న పరిస్థితి.

ఎక్కడ చూసినా తాగి పడేసిన మద్యం సీసాలు

సత్యనారాయణపురంలోని రైల్ పార్కులో అసాంఘిక కార్యక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పార్కులో ఎక్కడ చూసినా తాగి పడేసిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్‌లు, బాటిళ్లు గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. ఈ పార్కు బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని ఉండటంతో బయట నుంచి ఆకతాయిలు, మద్యంరాయుళ్లు రాత్రుళ్లు తమ వాహనాలతో పార్కుకు చేరుకుని మద్యం, గంజాయి తాగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటు ఆర్‌పీఎఫ్ గాని, జిల్లా పోలీసులు గాని వీరిపై దృష్టి పెట్టకపోవడంతో వారి అకృత్యాలకు అడ్డు, అదుపు లేకుండా పోతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు పార్కు అభివృద్ధిపై దృష్టిపెట్టి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



పార్కులో దర్శనమిస్తున్న మద్యం సీసాలు



పూర్తిగా దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్

డబ్బులు ఇవ్వలేదని ఆటో డ్రైవర్‌పై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటోడ్రైవర్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాపురం గ్రామానికి చెందిన చొక్కర సాయి మణికంఠ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. మణికంఠ గతంలో వైఎస్సార్ కాలనీలో నివాసం ఉన్న సమయంలో కాలనీకి చెందిన బబ్లు, బన్నీలు పరిచయం. ఆటోలో పాసింజర్స్‌ను ఎక్కించుకుని కాలనీకి వెళ్లినప్పుడల్లా బబ్లు, బన్నీలు మణికంఠను బెదిరించి డబ్బులు అడిగే వారు. అయితే శుక్రవారం రాత్రి కూడా ఆటో వైఎస్సార్ కాలనీకి వెళ్లగా బబ్లు వచ్చి డబ్బులు అడిగాడు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో అక్కడే ఉన్న బన్నీని పిలిచాడు. ఇద్దరు కలిసి సరుగు బాధులతో మణికంఠపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఈతరం కవిత్వ విమర్శ వర్క్‌షాప్ ప్రారంభం

విజయవాడకల్చరల్: ప్రతి తరం తనకు అవసరమైన సాహితీ సృజనను సృష్టించుకుంటోందని సీనియర్ కవి ఖాదర్ మొహిద్దీన్ అన్నారు. హోరు ఆధ్వర్యంలో ఈశ్వర వరప్రసాద్ ట్రస్ట్ సౌజన్యంతో రెండు రోజుల పాటు నిర్వహించే ఈతరం కవిత్వ విమర్శ వర్క్‌షాప్‌ను విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో శనివారం ప్రారంభించారు. ఖాదర్ మాట్లాడుతూ.. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ బంగారువాన కథలో వివరించినట్లు కవిత్వం, కథ ఎంపిక ఏవిధంగా ఉండాలో రచయితకు, విమర్శకునికి తెలియాలన్నారు. సాహితీవేత్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ నేటి తరం రచయితలు తమ తూనిక రాళ్లను తామే ఏర్పాటు చేసుకోవాలని, విమర్శలను విశ్లేషణ చేసుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం అండతోనే నకిలీ మద్యం దందా

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు
- విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్ వద్ద సీపీఎం ధర్నా

భవానీపురం(విజయవాడపశ్చిమ): చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండదండలతోనే నకిలీ మద్యం దందా నడుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ధ్వజమెత్తారు. విజయవాడ విద్యాధరపురం చెరువు సెంటర్‌లో నకిలీ మద్యం అమ్ముతున్న శ్రీనివాస వైన్స్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. సీపీఎం బృందం శ్రీనివాస వైన్స్ దగ్గరకు వచ్చేసరికి మద్యం అమ్మకాలు జరుగుతుండగా వారు లోపలకు వెళ్లి అడ్డుకున్నారు. నకిలీ మద్యం బాటిల్స్‌ను అందిపుచ్చుకుని బయటకు వచ్చి పగులకొట్టి షట్టర్లు మూయించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో యథేచ్ఛగా సాగుతున్న నకిలీ మద్యం అమ్మకాల వెనుక పెద్ద మాఫియా ఉందని, దానికి రింగ్ మాస్టర్లు కూటమి ప్రభుత్వ పెద్దలేనని అన్నారు. నకిలీ మద్యం కేసులో కీలకంగా వ్యవహరించిన జయచంద్రారెడ్డికి తంబళ్లపల్లి ఎమ్మెల్యేకి టీడీపీ పక్షాన టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. నకిలీ మద్యం తయారీ, డిస్ట్రిబ్యూషన్ కార్యకలాపాల్లో జయచంద్రారెడ్డి భాగస్వామి జనార్ధనరావుకు ఇక్కడి శ్రీనివాస వైన్స్‌లో వాటా ఉందని, ఇందులో నకిలీ మద్యం అమ్ముతున్నారని ఎక్సైజ్ శాఖ ప్రకటించిన తరువాత కూడా అమ్మకాలు జరుగుతున్నాయంటే ప్రభుత్వ ప్రోత్సాహంతోనేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.



వైన్ షాపు ముందు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తున్న బాబూరావు, సత్యబాబు, మహిళలు

నకిలీ మద్యం అమ్ముతున్న శ్రీనివాస వైన్స్‌పై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. స్థానిక ఎక్సైజ్ సీఐని అడిగితే శ్రీనివాస వైన్స్‌కు నోటీసులివ్వాలట.. తరువాత ప్రాసెస్‌కు వారం రోజులు పడుతుందట, అంటే మరో వారం రోజులు ఇక్కడ నకిలీ మద్యం అమ్ముకోమని అనుమతి ఇస్తున్నారా అంటూ ధ్వజమెత్తారు. ఎక్సైజ్, పోలీసులతో కాకుండా సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నకిలీ సమస్యను స్థానిక ఎమ్మెల్యేకు తెలియచేద్దామంటే ఆఫీస్ కార్యదర్శికి చెప్పుకోవల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. శ్రీనివాస వైన్స్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఇకపై ఇక్కడ అమ్మకాలు జరగకుండా చూస్తామని భవానీపురం సీఐ, ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, ఐద్వా నాయకురాళ్లు సరోజ, కె వెంకటరత్నం, కె.శేషుమణి, సీఐటీయూ నాయకులు ఈవీ నారాయణ, ఎస్.సుబ్బారెడ్డి, ఎండీ మస్తాన్, ఎస్.కృష్ణ, కె.వరలక్ష్మి, బీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం అమ్ముతున్న శ్రీనివాస వైన్స్‌ను సీజ్ చేయాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం చెరువు సెంటర్‌లో నకిలీ మద్యం అమ్ముతున్న శ్రీనివాస వైన్స్‌ను వెంటనే సీజ్ చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పొదిలి చంటిబాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నకిలీ మద్యం కేసులో సూత్రధారిగా ఉన్న అద్దేపల్లి జనార్ధనరావు బినామీగా ఉన్న శ్రీనివాస వైన్స్‌లో నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు ప్రకటించిన ఎక్సైజ్ అధికారులు దానిపై చర్యలు తీసుకోవడానికి ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. గతంలోకూడా ఈ వైన్స్‌పై ఎక్సైజ్ శాఖ అధికారులు సోదాలు చేసి నకిలీ మద్యం బాటిల్స్ సీజ్ చేసినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు వెలుగులోకి వచ్చిన సంఘటనతో అది మరింత బలపడిందని అన్నారు. నకిలీ మద్యంలో స్పిరిట్‌ను ఎక్కువ మోతాదులో కలపడం వలన ఆ మద్యం తాగుతున్నవారు అనారోగ్యానికి గురై చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మద్యం తయారీ, అమ్మకాల్లో కీలక పాత్ర పోషిస్తున్న అద్దేపల్లి జనార్ధనరావు భాగస్వామిగా ఉన్నందునే కూటమి ప్రభుత్వం శ్రీనివాస వైన్స్‌ను సీజ్ చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిబంధనలు అతిక్రమించే వైన్‌షాప్‌ల లైసెన్సులు రద్దు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో నకిలీ మద్యం విక్రయాలు జరిపినట్లుగా ఎక్సైజ్ శాఖ ధృవీకరించిన శ్రీనివాస వైన్స్‌పై ప్రభుత్వానికి ఎందుకు అంత ప్రేమ అని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇప్పటి వరకు దానిని ఎందుకు సీజ్ చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం అమ్మకాలు చేస్తున్న జనార్ధనరావుకు చెందినదిగా చెబుతున్న శ్రీనివాస వైన్స్‌లో గడిచిన 17 నెలల్లో రెండున్న కోట్ల అక్రమ మద్యాన్ని విక్రయించారని ఆరోపించారు. దాని సిండికేట్‌లో సుమారుగా 15 నుంచి 20 మంది ఉన్నారని వారందరిపైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దుకాణం ఉన్న స్థానిక భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో గడిచిన ఏడాదిలో పది అనుమానాస్పద మృతులున్నాయని తెలిపారు. అవన్నీ నకిలీ మద్యం వల్ల జరిగాయనే అనుమానాలు ఉన్నాయని, వాటిపై స్థానిక సీఐ ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు. నకిలీ మద్యం తయారువుతున్న మైలవరం, అమ్మకాలు జరుగుతున్న పశ్చిమ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు వసంత కృష్ణప్రసాద్, సుజనాచౌదరి, ఎంపీ చిన్ని ఎందుకు దీనిపై స్పదించడం లేదని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలంటే మీకు లెక్కలేదా..? నకిలీ మద్యం కమిషన్లు మీకు ముదుతున్నాయా అని ఆయన ప్రశ్నించారు. పశ్చిమ నియోజకవర్గంలో చాలా బార్లు, వైన్ షాపులు 24 గంటలు అమ్మకం చేస్తున్నారనే సమాచారం ఉందని, నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు చేస్తున్న వాటి లైసెన్స్‌లను తక్షణం రద్దు చేయాలని కోరారు. విజయవాడ సీపీ వాటిపై నిఘా ఉంచి నిబంధనలు అతిక్రమించిన వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పోతిన మహేష్

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు



శరవణ వీరభద్రశర్మ

కృష్ణలంక(విజయవాడతూర్పు): వేదం చదువుతున్న ఓ బాలుడు కనిపించకుండా పోయిన ఘటనపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు కృష్ణలంక, మెట్లబజార్‌లో నివాసం ఉంటున్న కోట శివశంకర శర్మ వేదపారాయణం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు. వారిద్దరూ కృష్ణలంకలో వేదం చదువుతున్నారు. రెండో కుమారుడైన కోట శరవణ వీరభద్రశర్మ(15) ఈ నెల 8వ తేదీ ఉదయం 8 గంటలకు మచిలీపట్నం దగ్గర ఉన్న సిగరాయపాలెం గ్రామంలోని సుబ్రహ్మణ్య స్వామిగుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. నాలుగు రోజులైనప్పటికీ తిరిగి ఇంటికి చేరుకోలేదు. గుడి వద్ద, బంధువులు, స్నేహితులను విచారించినా అతని ఆచూకీ లభించలేదు. దీనిపై బాలుడి తల్లి కల్యాణి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సూపర్‌స్టార్ కృష్ణకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఇవ్వాలి

కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినీనటుడు, సూపర్‌స్టార్ కృష్ణకు దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కృష్ణ ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు సుధా స్వామి కోరారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సూపర్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో సుధా స్వామి మాట్లాడుతూ.. సూపర్‌స్టార్ కృష్ణకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఇవ్వాలని, ఈ మేరకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి కేంద్రానికి సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌స్టార్ కృష్ణ సినీ పరిశ్రమకు చేసిన సేవలను కొనియాడారు. పరిశ్రమలో నూతన ఆవిష్కరణలకు కృష్ణ కేంద్ర బిందువుగా ఉన్నారన్నారు. పేదలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. సామాజిక, రాజకీయంగాను ఆయన ప్రజలను చైతన్య పరిచారన్నారు. ఆయనను దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించి గౌరవించడం సముచితమన్నారు. అసోసియేషన్ తరపున ఇప్పటికే విజయవాడ ఎంపీ చిన్నిని కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో కృష్ణ, మహేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాస్వామి తదితరులు

సీజేఐపై దాడిని ఖండిస్తూ నిరసన

భవానీపురం(విజయవాడపశ్చిమ): సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్రాన్ని ఖండిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం గొల్లపూడిలోని అంబేడ్కర్‌నగర్‌లోగల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఏబీసీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, న్యాయవాది అవుల వెంకట్రావు, సంఘం ప్రెసిడెంట్ ఆర్.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఆర్.గోపాలం, ట్రెజరర్ డీ నాగేశ్వరరావు, సీపీఎం కార్మిక నాయకుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టులో కేసులపై విచారణ జరుగుతుండగా జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి యత్నించడం భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించారు. నిందితుడిని కఠినంగా శిక్షించి న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం కలిగేలా చూడాలని కోరారు. ఒక లాయర్ సీజేఐపై షూ విసరడాన్ని తీవ్రంగా పరిగణించాలని అన్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టి విద్వేషాలను రెచ్చగొట్టేందుకే నిందితుడు ఈ చర్యకు పాల్పడ్డాడని తెలిపారు.




గొల్లపూడిలో నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

మాజీ మంత్రి పేర్నిపై కక్ష సాధింపు దుర్మార్గం

జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దిన్

వించిపేట(విజయవాడపశ్చిమ): మాజీ మంత్రి పేర్ని నానిపై మంత్రి కొల్లు రవీంద్ర కక్ష్య సాధింపు చర్యలు దుర్మార్గమని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దిన్ విమర్శించారు. శనివారం ఆయన వించిపేటలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. దీనిపై మాజీ మంత్రి పేర్ని నాని పోలీసులను ప్రశ్నిస్తే అక్కడి సీఐ ఆయనపై దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. అయితే దీనిపై మంత్రి కొల్లు రవీంద్ర పోలీసులపై దౌర్జనం చేశారంటూ వ్యాఖ్యానించడం దుర్మార్గమన్నారు. తన రాజకీయ కక్ష్య సాధింపు కోసం పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ నానిపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



గౌస్‌మొహిద్దిన్

ఆకట్టుకున్న ఇన్నోవా ఎక్స్‌పో - 2025

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న నైపుణ్యాలను ప్రదర్శించుటకు, వారికి ఇష్టమైన అంశాల్లో ఆసక్తిని వ్యక్తపరచుటకు ఎగ్జిబిషన్లు దోహదపడతాయని ఎస్ఎస్ఎం స్కూల్ ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి అన్నారు. పటమటలోని ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఇన్నోవా ఎక్స్ పో - 2025 నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయుటకు, మ్యాథ్స్, సైన్స్, సోషల్ అంశాల పట్ల ఆసక్తిని పెంపొందించుటకు ఇలాంటి ప్రదర్శనలు తోడ్పడుతాయన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో విజ్ఞాన శాస్త్రం, గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన ప్రాజెక్టులను చార్ట్‌లను విద్యార్థులు ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌లో ప్రధానంగా డ్రోన్ షో, రాకెట్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తయారుచేసిన 8 రకాల రాకెట్లను, అవి పని చేసే విధానాన్ని ప్రదర్శనలో వివరించారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానం, పారిశుద్ధ్యం నిర్వహణ తీరు, రోబోటిక్ నిర్మాణం-అవి నిర్వహించే కార్యకలాపాలు తదితర అంశాలను ప్రదర్శించారు. వ్యవసాయ ఉత్పత్తులను అధికంగా దిగుబడి చేసేందుకు, పంట రక్షించుటకు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతులు, మానవ శరీర నిర్మాణంలో గుండె, కిడ్నీలు పనిచేసే విధానాలు తదితర ప్రదర్శనలు ఆకర్షించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ మోంట్ ఫోర్ట్, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తాము రూపొందించిన ప్రయోగాలను వివరిస్తున్న విద్యార్థులు

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): నాలుగు రోజులుగా తన భార్య లక్ష్మి(22) కనిపించడం లేదని పొట్లూరి సురేష్ అనే వ్యక్తి ఫిర్యాదుతో శనివారం నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు, నున్న గ్రామం వికాస్ కాలేజీ రోడ్డు మామిడి తోటలో కాపలా పనులు చేస్తూ భార్య ,మరదలు, చెల్లి, ఇద్దరు పిల్లలతో ఫిర్యాది నివసిస్తున్నాడు. ఈ నెల 7న కూరగాయాలు కొనేందుకు పాయకాపురంలోని రైతుబజారుకు తన భార్య లక్ష్మి, మరదలు తిరుపతమ్మ, చెల్లి మరియమ్మలతో కలిసి వెళ్లిందన్నారు. కూరగాయలు కొనుగోలు చేసిన అనంతరం లక్ష్మి తాను హైదరాబాద్ వెళ్తున్నానని, పైపులరోడ్డు వైపు వెళ్లిందన్నారు. అప్పటి నుంచి తిరిగి రాలేదని సురేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి, కొడుకులపై దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు తండ్రి కొడుకులపై దాడి చేసిన ఘటన సితారా సెంటర్ సొరంగం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. భవానీపురం పోలీసు కాలనీకి చెందిన ద్వారా మణిశంకర్ లాయర్‌గా పనిచేస్తున్నాడు. అతని తండ్రి శ్రీనివాసరావు సొరంగం వద్ద శారీస్ దుకాణం నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి శ్రీనివాసరావు షాపు వద్ద ఉండగా అతని కొడుకులు ఇద్దరు మణిశంకర్, సురేష్ భార్య పిల్లలతో కలిసి అక్కడికి వెళ్లారు. పిల్లలు ఆకలిగా ఉందని చెప్పడంతో మణిశంకర్, సురేష్ శారీస్ షాపు నుంచి కొంతదూరం వెళ్లారు. ఈలోగా గుర్తు తెలియని వ్యక్తి షాపు వద్దకు వచ్చి శ్రీనివాసరావుపై దాడి చేశాడు. దీంతో ఆయన తన కుమారులకు ఫోన్ చేసి చెప్పడంతో వారు షాపు వద్దకు వచ్చి ఆ వ్యక్తిని నిలువరించి ఎవరు.. ఎందుకు కొడుతున్నావని అడిగారు. ఆ వ్యక్తి వీరిద్దరిపై కూడా దాడి చేశాడు. మరో వ్యక్తి కూడా వచ్చి దాడి చేయడంతో మణిశంకర్ ఎడమ చేతి వేలు విరిగింది. తలకు గాయాలయ్యాయి. జీజీహెచ్‌కు వెళ్లగా వేలికి సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. దీనిపై మణిశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

PUBLIC NOTICE

General Public is hereby informed that, my Client Smt. Sakshi Purohit, W/o. Prashanth K Rajpurohit, is intending to purchase the property described in the Schedule hereunder from its true owner Sri Maddali Venkata Pavan Ravi Kiran, S/o. Rammohan Rao and in furtherance of the same, Agreement of Sale was entered and part payments were also made by my Client. That, if any person or persons have any objection or right/claim/title/interest in respect of said property, the same shall be communicated within Four (4) days from the date of this publication to the undersigned at the below mentioned address with all relevant original documents, and if no claim or objections are received, it would be deemed that there is none, and the transaction would fructify into a registered document. The claims without documentary proof and/or objections directly published in the newspaper shall not be considered.

SCHEDULE

All the part and parcel of Shop Nos. 3 & 4 on East Side & Shop Nos. 1, 2 & 4 on West Side of Ground Floor in Building namely: "BHIMA COMPLEX", admeasuring 56.77 Square Yards out of 113.54 Square Yards, including 952 Sft., Vijayawada I Town, Pulipativari Street, present Municipal Ward No.11/2, Revenue Ward No.6, Block No.2, N.T.S. No. 130, Old Assessment No.8115, 8115 A, Old D.No.11/40/14, present D.No. 11-40-20/4, New Assessment No. 1073025547, with the following boundaries of the Building:- **East:** Property belonging to Sri Pulipati Venkata ratnam, **South:** Property belonging to K. Bhimarjuna Rao, **West:** Property belonging to Poturi Sudhakar, **North:** Road abutting Pulipativari Street.

TUPAKULA NIKHIL., Advocate
Flat No. 207, 2nd Floor, Sai Sri Towers, Street No. 4, Himayath Nagar, Hyderbad-500029.
Cell: 8520855599

PUBLIC NOTICE

General Public is hereby informed that, my client Sri Abbu Naga Malleswara Rao, S/o. A. Tirupataiah, is intending to purchase the property described in the Schedule hereunder from its true owner Sri Maddali Venkata Pavan Ravi Kiran, S/o. Rammohan Rao and in furtherance of the same, Agreement of Sale was entered and part payments were also made by my Client. That, if any person or persons have any objection or right/claim/title/interest in respect of said property, the same shall be communicated within Four (4) days from the date of this publication to the undersigned at the below mentioned address with all relevant original documents, and if no claim or objections are received, it would be deemed that there is none, and the transaction would fructify into a registered document. The claims without documentary proof and/or objections directly published in the newspaper shall not be considered.

SCHEDULE

All the part and parcel of Shop No.3 on West Side of Ground Floor in Building namely: "BHIMA COMPLEX, admeasuring 56.77 Square Yards out of 113.54 Square Yards, Vijayawada I Town, Pulipativari Street, present Municipal Ward No.11/2, Revenue Ward No.6, Block No.2, N.T.S.No.130, Old Assessment No.8115, 8115 A, Old D.No. 11/40/14, present D.No.11-40-20/4, New Assessment No. 1073025547, with the following boundaries of the Building viz:- **East:** Property belonging to Sri Pulipati Venkataratnam, **South:** Property belonging to K. Bhimarjuna Rao, **West:** Property belonging to Poturi Sudhakar **North:** Road abutting Pulipativari Street.

TUPAKULA NIKHIL., Advocate
Flat No. 207, 2nd Floor, Sai Sri Towers, Street No. 4, Himayath Nagar, Hyderbad-500029.
Cell: 8520855599